క్లుప్తంగా

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఏఈ శీలం యేసురాజు గురువారం విలేకరులకు తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా ద్రాక్షారామ, తోటపేట, అన్నాయిపేట, వేగాయమ్మపేట, వెంకటాయపాలెం, వెలంపాలెం, నెలపర్తిపాడు, జగన్నాయకులపాలెం, తాళ్లపాలం, వెల్ల, వెల్ల సావరం, ఏరుపల్లి, కందులపాలెం, హసన్‌బాద, ఉండూరు, కాపవరం, తాడిపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు.

పలువురికి ఎమ్మెల్యే వేగుళ్ల పరామర్శ

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఆప్తులను కోల్పోయి బాధల్లో ఉన్న పలువురిని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు బుధవారం పరామర్శించారు. వల్లూరులో పాలచర్ల దొరబాబు, నల్లూరులో వీరబోయిన సూర్యారావు, కాలా సత్యవతి, కాదా సూరయ్య కుటుంబాల వారిని ఆయన పరామర్శించారు. ఆయన వెంట ముత్యాల వెంకట్రావు తదితర నాయకులు ఉన్నారు.

వనరుల వినియోగంపై అవగాహన అవసరం



విజేతలైన విద్యార్థులతో నిర్వాహకులు

కపిలేశ్వరపురం: నీరు తదితర సహజ వనరుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహనతో మెలగాలని ఎబిఎం, ఐ లవ్ అంబేడ్కర్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పోటీల కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. పడమర ఖండ్రికలోని అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్‌లో నీటి సంరక్షణపై చిత్రలేఖనం, పోటీలను నిర్వహించారు. జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానంలో డి.సునంద్, ద్వితీయ స్థానంలో ఎం.నిర్మల, తృతీయ స్థానంలో ఎం.వర్షిత్, సీనియర్ విభాగం ప్రథమ స్థానంలో ఎస్.లాస్య తేజస్విని, ద్వితీయ స్థానంలో టి.రాహుల్, తృతీయ స్థానంలో ఎం.మరియా విజేతలుగా నిలిచారు. ముఖ్య అతిథిగా ఎస్‌ఎస్ఎస్ గైడ్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ షేక్ మేరా హాజరై విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ప్రతిభా పోటీల్లో 50 మంది హాజరు కాగా నీటిని పొదుపుగా వినియోగించుకునే ప్రాధాన్యతను వివరించిన విద్యార్థులకు నిర్వాహకులు అభినందనలు తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా మాతా చిన్నబాబు, పాలింగి ప్రభాకర్ వ్యవహరించారు. కార్యక్రమంలో చిన్నబాబు, కిషోర్ కుమార్, సతీష్, శ్రీను పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణాన్ని కాపాడుదాం

అంబాజీపేట: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి వారి ప్రాణాలు కాపాడదామని అంబాజీపేట స్వామి వివేకానంద యోగా ఆశ్రమం, ఆయుర్వేదం ఫిజియోథెరపీ హాస్పటల్ వైద్యుడు, యోగా గురువు యోగా శ్రీనివాస్ అన్నారు. స్థానిక సాయికృష్ణ తల్లీపిల్లల ఆస్పత్రిలో అనారోగ్యంతో బాధపడుతున్న యు.నాగబాబుకు మూడు ప్యాకెట్ల రక్తాన్ని గురువారం అందజేశారు. అలాగే అమలాపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు అవసరమైన వారికి 11 మంది యోగా శ్రీనివాస్ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారిలో కె.సత్తిబాబు, ఎం.కొండ, పి.నవీన్, వై.మధుసూదన్‌రావు, ఎస్.మాధవ్, ఎస్.కిరణ్, ప్రవీణ్, ఎస్.నాగబాబు, ఎల్.సాత్విక్, ఎం.శ్రీను, ఎల్.మధుసూదనరావు ఉన్నారు.

జాతరకు భక్తుల తాకిడి

ఆలమూరు: చింతలూరు నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థోత్సవాలకు భక్తుల తాకిడి కొనసాగుతోంది. నాలుగో రోజు గురువారం భక్తుల రద్దీ ఎక్కువ కావడంతో క్యూలైన్లు కిక్కిరిశాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కుబడులు తీర్చుకున్నారు. జెయింట్‌వీల్, కొలంబస్, రంగులరాట్నాలను ఎక్కేందుకు చిన్నారులు ఆసక్తి కనబర్చారు. ఆలయం వద్ద పలు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పోలీసు బందోబస్తు కొనసాగిస్తున్నారు. పక్షం రోజుల పాటు భక్తుల తాకిడి అధికంగా ఉంటుందని ఆలయ ఈఓ ఎంఎస్ఆర్ కృష్ణ, జేఏ డి.భాస్కర శ్రీనివాసు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



విఘ్నేశ్వరుని ఆలయంలో స్వామి వారిని దర్శించుకుంటున్న పాముల రాజేశ్వరీదేవి

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకురాలు పాముల రాజేశ్వరీదేవి గురువారం ప్రత్యేక పూజలు జరిపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని, ఎన్నికల్లో 175 సీట్లలో వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థులు, అలాగే 25 ఎంపీ అభ్యర్థులు గెలవాలని విశేష పూజలు జరిపారు. ఆమె వెంట ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, పాముల దేవీశ్రీప్రసాద్, పార్టీ నాయకులు ఉన్నారు.

మంచిని ప్రజలకు వివరించండి

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు
- సోమేశ్వరం, పసలపూడి గ్రామాల్లో పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశాలు



సోమేశ్వరం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి త్రిమూర్తులు

రాయవరం: దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు మేలు జరిగిందని, చేసిన మంచిని ప్రజలకు వివరించే బాధ్యత పార్టీ శ్రేణులు తీసుకోవాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని సోమేశ్వరం, పసలపూడి గ్రామాల్లో గురువారం వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. త్రిమూర్తులు మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి ఏదో ఒక రూపంలో మేలు జరిగిందన్నారు. చేసిన మేలును గుర్తు పెట్టుకుని తిరిగి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకుని వచ్చేందుకు ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో సుపరిపాలన కావాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి రావాల్సిన అవసరం ఉందన్నారు. పేదలు, బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీల సంక్షేమమే లక్ష్యంగా సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఒక్క నెల రోజులు కష్టపడితే ఐదేళ్లు ప్రజా సేవ చేసే అవకాశం దక్కుతుందన్నారు. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ కష్టకాలంలో ప్రజల వెన్నంటి ఉంటే త్రిమూర్తులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీపీ నౌడు వెంకటరమణ, వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ సిరిపురపు శ్రీనివాసరావు, పారిశ్రామికవేత్త చింతా వెంకటరెడ్డి, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి సర్పంచులు ఆరిఫ్, కడలి పద్మావతి, ఎంపీటీసీ కాళ్ల అప్పారావు, సొసైటీ అధ్యక్షుడు చింతా రామ్మోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ పోతంశెట్టి సాయిరామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కోట వెంకట్రావు, పార్టీ నేతలు చైతన్య రాజబాబు, నల్లమిల్లి వెంకటరెడ్డి, పోతంశెట్టి సత్యస్వరూపరెడ్డి తదితరులు అన్నారు. అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు, అసెంబ్లీ అభ్యర్థి తోట త్రిమూర్తులు విజయానికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ నేతలు ప్రతినబూనారు. సమావేశంలో దేవస్థానం చైర్మన్ గరగ వెంకటేశ్వరావు, పార్టీ మండల బూత్ కమిటీ కన్వీనర్ చింతా సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు పోతంశెట్టి సత్తిబాబు, గుడాల సుబ్రహ్మణ్యం, నాగదేవర తాతాజీ అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరికలు



ద్రాక్షారామలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పలువురు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. గురువారం స్థానిక పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద జరిగిన కార్యక్రమంలో సూర్యప్రకాశ్ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులకు నిత్యం అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. సంఘ పెద్దలు మాట్లాడుతూ సూర్యప్రకాశ్ గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. సంఘ ప్రతినిధులు కొసనా కామేశ్వరరావు, కొసనా ప్రసాద్, చెల్లూరి శివన్నారాయణ, కొసనా భీమశంకరం, పోలవరపు సుబ్బారావు, టేకి శ్రీనివాస్, దవళేశ్వరపు దుర్గాప్రసాద్, గారోజు సూరిబాబు, కాల్దారి వెంకటేశ్వరరావు, భరిణికల సత్యనారాయణ, నేదునూరి సూరిబాబు, దాకోజు వీరబాబు, దాకోజు శ్రీనివాసు తదతరులు సుమారు 300 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు చింతలపాటి శ్రీనివాసరాజు, అడివి కుమార్, ద్రాక్షారామ ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు హామీలను ప్రజలు నమ్మరు



కాజులూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్

ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్

కాజులూరు: ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు టీడీపీ నేత చంద్రబాబు చేస్తున్న అబద్ధపు హామీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. గురువారం కాజులూరు శివారు అగ్నికుల క్షత్రియుల పేట, చాకిరేవుమెరక తదితర గ్రామాలలో ఆయన ఇంటింటా పర్యటించి, ఆయన తనయుడు, రామచంద్రపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికులు, మహిళలు ఎంపీ బోస్, ఇతర నాయకులకు ఘన స్వాగతం పలికారు. పేద మహిళలు, వృద్ధులను ఎంపీ బోస్ ఆప్యాయంగా పలకరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలన్నీ నూరు శాతం అమలు చేశారన్నారు. దేశవ్యాప్తంగా ఇంత భారీ ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందన్నారు. దళారుల ప్రమేయం లేకుండా పథకాల లబ్ధిని నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నట్టు పేర్కొన్నారు. గత టీడీపీ పాలనలో రుణమాఫీ చేస్తామని రైతులు, డ్వాక్రా మహిళలను చంద్రబాబు మోసం చేశారని, అప్పుకు వడ్డీలు పెరిగి వాటిని తీర్చలేక ప్రజలు సతమతమయ్యారని గుర్తుచేశారు. మరలా టీడీపీ, జనసేన నాయకులు అబద్ధపు హామీలతో మోసం చేసేందుకు వస్తున్నారని, ప్రజలు వారికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ ఫ్యాను గుర్తుకే ఓటు వెయ్యాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, వైస్ ఎంపీపీలు రేఖాడి విజయ, పెదిరెడ్డి వెంకటరమణ, సర్పంచ్ దండంగి సరోజిని, ఉప సర్పంచ్ దండంగి చిన్నారావు, యాళ్ల నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి పట్టం కట్టండి

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాష్



యర్రపోతవరంలోని పంపనవారిపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న సూర్యప్రకాష్

కె.గంగవరం: పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమం అందాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని రామచంద్రపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. టీడీపీ వస్తే ప్రజలను దోచుకుతినేందుకు జన్మభూమి కమిటీలు వస్తాయని చెప్పారు. మండలంలోని యర్రపోతవరం, అద్దంపల్లి గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా పేదలు ఏ లబ్ధి కావాలన్నా జన్మభూమి కమిటీలకు ముడుపులు చెల్లించుకోవాల్సి వచ్చేదన్నారు. జగనన్న ప్రభుత్వం ఏర్పడ్డాక అర్హులైతే చాలు సంక్షేమం ఇంటి గుమ్మంలోకే వచ్చేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజారంజక పాలన అందించారని తెలిపారు. కులం, మతం, పార్టీ బేధాల్లేకుండా అందరికీ సంక్షేమాన్ని అందించిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సంక్షేమ ప్రభుత్వం కావాలో, జన్మభూమి కమిటీలు కావాలో ప్రజలు విజ్ఞతతో ఆలోచించి, సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలతా తమ విలువైన ఓటును ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థి రాకాక వరప్రసాద్‌కు ఫ్యాన్ గుర్తుపై వేయాలని కోరారు. ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్‌లు చింతపల్లి లక్ష్మీ వెంకటరమణ, పిల్లి రాంబాబు, వైస్ ఎంపీపీ దూడల నాగేశ్వరరావు(చినబాబు), మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు బత్తుల అప్పారావు, బీసీ నాయకులు పంపన సుబ్బారావు, యువజన నాయకులు జుత్తుక శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగనే మళ్లీ సీఎం కావాలి

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాష్



గొల్లపాలెంలో వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేస్తున్న సూర్యప్రకాష్

కాజులూరు: రాష్ట్రంలో పేద ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. గొల్లపాలెంలో ఎస్సీపేటలో స్థానిక ఎంపీటీసీ జొన్నకూటి వెంకట పద్మజ, వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు దళిత మహిళలు, యువకులు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరారు. వారికి ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ పార్టీ కండువాలు వేసి, స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో ప్రజలు మరలా వైఎస్సార్ సీపీని గెలిపించుకోవటం ద్వారా భవిష్యత్తులో మరిన్ని పథకాలను పొందగలుగుతారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొప్పుల సత్యనారాయణ, ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరీదేవి, పార్టీ నాయకులు దంగేటి వెంకన్న, మాదిరెడ్డి పృథ్వీ, టేకుమూడి దుర్గారావు, ఉంగరాల శివ, పలివెల సూరిబాబు, చంద్రయ్య, కోటిపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సాగు నీటి సరఫరా

కొత్తపేట: వంతుల వారీగా సాగు నీరు సరఫరాలో భాగంగా వాడపాలెం లాకు పైన వాడపాలెం ఓల్డ్, న్యూ చానళ్లకు శుక్రవారం నుంచి సాగునీరు సరఫరా చేస్తామని ఇరిగేషన్ శాఖ కొత్తపేట సెక్షన్ ఆఫీసర్ వి.నవీన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి శనివారం ఉదయం 6 గంటల వరకూ (24 గంటలు) నీరు సరఫరా చేయనున్నట్టు చెప్పారు. ఆయా చానళ్ల కింద రబీ వరి పంట సాగు చేస్తున్న రైతులందరూ పంట బోదులను బాగుచేసుకుని, సాగునీటిని చివరి భూముల వరకూ వినియోగించుకోవాలని కోరారు.

అన్నదానం ట్రస్టుకు విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాలబాలాజీ స్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు గురువారం దాతలు రూ.10 వేలు విరాళంగా అందించారు. హైదరాబాద్‌కు చెందిన పులపర్తి లలిత ప్రణతి, ప్రియ హాసిని పుట్టిన రోజు సందర్భంగా ఏటా ఆగస్టు 3న అన్నదానం నిర్వహించేందుకు వారి కుటుంబ సభ్యులు ఈ విరాళం ఇచ్చారని ఆలయ ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. దాత కుటుంబ సభ్యులకు ఆలయ ఉద్యోగులు, అర్చకులు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

మానవాళికి శాంతి సందేశం

- ఘనంగా రంజాన్ వేడుకలు
- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు



రంజాన్ వేడుకల్లో ముస్లిం పెద్దలు, యువకులు

రామచంద్రపురం: ఇస్లాం మానవాళికి శాంతి సందేశం అందిస్తుందని రామచంద్రపురం జామియా మసీద్ ఇమామ్ కమాలుద్దీన్ అన్నారు. పట్టణంలో గురువారం ఈద్-ఉల్-ఫితర్ రంజాన్ పండగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నెల రోజుల పాటు కఠిన ఉపవాసాలు చేసిన ముస్లింలు గురువారం ఈద్ నమాజ్ ఆచరించారు. పట్టణంలోని ప్రధాన రహదారి మసీద్ సెంటర్ లోని జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా షాదీఖానాను అందంగా అలంకరించారు. ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేశారు. రంజాన్ పండగను పురస్కరించుకొని సంప్రదాయబద్ధంగా కొత్త దుస్తులు ధరించి చిన్నా పెద్దా అందరూ మసీదులకు చేరుకున్నారు. పిల్లలు, పెద్దలు పరస్పరం ఈద్ ముబారక్ చెప్పుకొన్నారు. ముస్లింలు అధికంగా నివసించే మార్కెట్ ఏరియాలో పండగ వాతావరణం కనిపించింది. జామియా మసీద్‌లో జరిగిన ప్రార్థనల్లో ఇమామ్ మాట్లాడుతూ పరమత సహనంతో పాటు, ప్రతి వ్యక్తిని ఆదుకోవాలనే తలంపు ఉండాలన్నారు. రంజాన్ మాసంలో ఆకలి దప్పికలను ఓర్చుకున్నట్లు మిగతా రోజుల్లో కూడా సాటివారి ఆకలిని గమనించి, వారికి ఆదరణ ఇవ్వాలన్నారు. పదిమందికి మేలు చేయమని ఖురాన్ బోధనలు చెబుతాయని పేర్కొన్నారు. పాలస్తీనాలో శాంతి నెలకొనాలని ప్రార్థనలు చేశారు. మసీదు ప్రెసిడెంట్ అబ్దుల్ కరీం, వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ రబ్బాని, సెక్రటరీ చాను, కో ఆప్షన్ సభ్యులు మస్తాన్, కమిటీ సభ్యులు ఇమామ్ సాబ్ కమాలుద్దీన్, గులాం మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

చేదువాడ, కాజులూరుల్లో..

కాజులూరు: ఖురాన్ బోధనలు, ప్రవక్తల త్యాగాలు నిత్యం మననం చేసుకుంటూ జీవితాన్ని గడపగలిగితే అల్లా ఆశీర్వచనాలు పొందినట్టేనని మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్లా రహమాన్ అన్నారు. మండలంలోని చేదువాడ, కాజులూరుల్లో గురువారం ముస్లిం సోదరులు రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం స్థానిక మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లు చేసి, పరస్పరం రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

మహనీయుడు జ్యోతిరావు పూలే



రామచంద్రపురంలో పూలే చిత్ర పటానికి ఆర్డీఓ సుధాసాగర్ తదితరుల నివాళి



రామచంద్రపురంలో పూలే చిత్ర పటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు



గొల్లపాలెంలో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆర్డీఓ సుధాసాగర్ నివాళులు

రామచంద్రపురం: సమాన హక్కుల కోసం, అట్టడుగు జాతుల విద్యాభివృద్ధి కోసం సమాజంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన మహనీయుడు మహాత్మా జ్యోతీరావు పూలే అని ఆర్డీఓ ఎస్ సుధాసాగర్ అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ మానవతావాది పూలే సామాజిక, దేశ సేవలను స్మరించుకోవాలన్నారు. మహిళా విద్యపై వివక్ష, పేదరిక నిర్మూలన, ఆర్థిక సమానత్వానికి పూలే ఎంతో కృషి చేశారన్నారు. సమాజం విద్యాపరంగా ఎదిగినప్పుడే అభివృద్ధి పథంలో నడవగలదని కాంక్షించిన సామాజిక తత్వవేత్తగా అభివర్ణించారు. ప్రజల హక్కుల కోసం పోరాడిన పూలే ప్రపంచానికే ఆదర్శమన్నారు, ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు వెంకట్రావు, శాంతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ ఆధ్వర్యంలో పూలే జయంతిని రాజగోపాల్ సెంటర్‌లోని సత్యదేవ కాంప్లెక్స్‌లో ఘనంగా నిర్వహించారు. సమాజంలోని కులపరమైన వివక్షతను, అన్యాయాలను రూపుమాపడానికి తన జీవితాన్ని ధారపోసిన మహనీయుడు పూలే అని కొనియాడారు. సీనియర్ న్యాయవాదులు కొండేపూడి భరత్‌కుమార్, పలివెల వెంకటరమణ ప్రసంగించారు. రామచంద్రపురం మండల మాజీ అధ్యక్షుడు కట్టా సూర్యానారాయణ, కె.గంగవరం మండల మాజీ అధ్యక్షుడు ఇళ్ల సూర్యానారాయణ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పంచాయతీరాజ్ సెల్ మాజీ అధ్యక్షుడు కొప్పిశెట్టి ఏడుకొండలు, బీసీ సంక్షేమ సంఘం ప్రచార కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ, గుత్తుల నాగబాబు తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ వై పద్మజ అధ్యక్షతన పూలే జయంతి జరిగింది. కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు

కాజులూరు మండలంలో..

కాజులూరు: మహాత్మా జ్యోతీరావుపూలే జయంతి వేడుకలు వివిధ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. గొల్లపాలెంలో శివాలయం వద్ద బీసీ నేత, విశ్రాంత ఉపాధ్యాయుడు మేడిశెట్టి శ్రీరాములు ఆధ్వర్యంలో డాక్టర్ శీలామంతుల వీరభద్రరావు పాల్గొని పూలే విగ్రహానికి నివాళులర్పించారు. దుగ్గుదుర్రు పీహెచ్‌సీ ఆవరణలో అమలాపురం శెట్టిబలిజ సంక్షేమ సంఘ కన్వీనర్ కడలి రాంపండు ఆధ్వర్యంలోనూ, కాజులూరులో డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ, తణుకువాడలో పీఏసీఎస్ అధ్యక్షుడు పితాని సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నాయకులు పూలే విగ్రహానికి నివాళులర్పించారు. స్థానిక నాయకులు కోకా హరి, అంగర కృష్ణ, నున్న రాంబాబు, దూడల ఏడుకొండలు, రవ్వా గోవిందు తదితరులు పాల్గొన్నారు.



కపిలేశ్వరపురం మండలం వెదురుమూడిలో పూలేకు నివాళులర్పిస్తున్న నాయకులు

కపిలేశ్వరపురం: జ్యోతీరావ్ పూలే సంస్కరణలతో సామాజిక ప్రగతి సాధ్యమైందని ఆయన 198వ జయంతి వేడుకలో పాల్గొన్న వక్తలన్నారు. కపిలేశ్వరపురం, వెదురుమూడి తదితర గ్రామాల్లో బుధవారం పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ప్రజాప్రతినిధులు గొల్లపల్లి సోనియా, బొక్కా రాంబాబు, సాకా శ్రీనివాస్, నాయకులు శీలం గోవిందు, మేడిశెట్టి దుర్గారావు, కట్టా మురళి, కాదా వెంకట రాంబాబు, లంకే కామేశ్వరరావు, పార్థసారథి, బీసీ సామాజిక ఉప కులాల, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ పూలే దంపతులు చేసిన త్యాగాలను వివరించారు. సమాజంలో కుల వ్యవస్థ రూపంలో దోపిడి, అణచివేతలు సాగాయన్నారు. ఆర్థిక, సామాజిక అణచివేతను ఎదిరించడంతో పాటు, వెనుకబడిన ప్రజల్లో విద్యా జ్యోతిని వెలిగించిన ఘనత పూలే దంపతులకు చెల్లిందన్నారు.

దానాలు చేసే వారిపై అల్లా దయ



అంగర మసీదులో ప్రార్థన చేస్తున్న ముస్లింలు

భక్తి శ్రద్ధలతో ఈద్-ఉల్-ఫిత్ర్

రాయవరం: మనం సంపాదనలో కొంత పేదలకు దానం చేయాలని, అలా చేసే వారిపై అల్లా దయ ఎన్నడూ ఉంటుందని ముస్లిం మత గురువు హఫీజ్ మహమ్మద్ అబూ బకర్ అన్నారు. వెదురుపాక మసీదులో నిర్వాహకుడు షేక్ అహ్మద్ బాషా ఆధ్వర్యంలో గురువారం రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇమామ్ అబూ బకర్ మాట్లాడుతూ ఒక్కో ముస్లిం రూ. 60 కాని, 2.66 కేజీల బియ్యాన్ని, లేదా గోధుమలను పేదలకు దానంగా ఇవ్వాలన్నారు. ఎన్ని ద్వేషాలున్నా అన్నీ మరచి ప్రేమ, స్నేహభావంతో అందరూ కలిసిమెలసి ఉండాలన్నదే రంజాన్ పర్వదినం ముఖ్య ఉద్దేశమన్నారు. మండలంలోని రాయవరం, లొల్ల, వెదురుపాక, చెల్లూరు మసీదుల్లో ముస్లింలు ఘనంగా రంజాన్ వేడుకలు నిర్వహించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని, పరస్పరం ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బుధవారం రాత్రి నెలవంక కనిపించడంతో నెల రోజులుగా చేస్తున్న రంజాన్ ఉపవాస దీక్షలను వారు విరమించారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. కొందరు ఇతర మతస్తులు ముస్లింలకు ఈద్ ముబారక్ తెలిపారు. ప్రార్థనల అనంతరం సేమ్యా, స్వీట్లు, డ్రై ఫ్రూట్స్ పంచారు. వెదురుపాకలో నిర్వహించిన రంజాన్ వేడుకల్లో ముస్లింలు సయ్యద్ బాషా, షేక్ ఖాజాబాబు, షేక్ బాబ్జీ, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: రంజాన్ మాసం ముగింపు సందర్భంగా అంగరలోని మస్జిద్-ఎ-ఇబ్రహీమ మసీదులో బుధవారం ఈద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మసీదు ముతవలి మహ్మద్ అబ్బాస్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థనలో ఇమామ్ మహ్మద్ నాజీం అక్తర్ రంజాన్‌రంజాన్ మాస ప్రత్యేకతను వివరించారు. ఈద్ ప్రార్థన అనంతరం ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పారు. బరియల్ గ్రౌండ్‌లోని సమాధుల వద్ద పూర్వీకులను స్మరించుకున్నారు. అంగర, పడమర ఖండ్రిక, టేకి, వల్లూరు, నల్లూరు, టేకి గ్రామాల ముస్లిం సోదరులు, ఇటుక బట్టీలలో పనిచేసేందుకు వలస వచ్చిన కార్మికులతో మసీదు వద్ద సందడి నెలకొంది.

రామచంద్రపురంలో..

రామచంద్రపురం రూరల్: రంజాన్ సందర్భంగా స్థానిక మార్కెట్‌లోని జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే వెలంపాలెం షబాజియా జామియా మసీదులోనూ ప్రార్థనలు జరిగాయి.

రామచంద్రపురం: పట్టణంలోని జామియా మసీదులో ఇమామ్ హఫీజ్ కమాలుద్దీన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.